క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి హేయమైన చర్య

తాడేపల్లి రూరల్: కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆమె భర్త రాముపై టీడీపీ దాడి అత్యంత హేయమని స్టేట్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాౖడు వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. బీసీ కులానికి చెందిన మహిళ, జిల్లా ప్రథమ పౌరురాలు, కేబినెట్ హోదా కల్గిన హారికపై టీడీపీ సేన విచక్షణారహితంగా మారణాయుధాలతో దాడి చేయడం దారుణమని ఖండించారు. ఈ సంఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని విమర్శించారు. ఆమెకు రక్షణ కల్పించాల్సిన ఖాకీలు పచ్చ చొక్కాలకు కాపలాదారులగా మారడం అత్యంత దురదృష్టకరమని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు, బీసీలకు, దళితులకు ఎన్నో ఉన్నత పదవులు ఇచ్చి ఎంతో గౌరవించారని గుర్తు చేశారు. మహిళలపై దాడిచేసే హీన సంస్కృతిని చంద్రబాబు ప్రోత్సహించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. భవిష్యత్తు ఎన్నికల్లో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

సరైన పత్రాలు లేని పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల



తాడికొండ: మండలంలోని తాడికొండ, పొన్నెకల్లుతో పాటు పలు గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సరైన పత్రాలు లేని రూ.5,47,872 విలువైన పురుగు మందులను సీజ్ చేసి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి బి. శ్రీనివాస నాయక్ తెలిపారు. దాడుల్లో కృష్ణాజిల్లా గన్నవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. సునీల్, ఒంగోలు పోలీసు ఇన్‌స్పెక్టర్ సీహెచ్. రవిబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి సీపీఐ ద్వితీయ మహాసభకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య తెలిపారు. గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్న సభలో ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు,జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావుతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు

కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టిన కారు



ప్రత్తిపాడు: వేపై కుక్కను తప్పించబోయి కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం నడింపాలెం పదహారవ నంబరు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు కారు దూసుకుపోతోంది. ఈ సమయంలో ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి, ప్రమాదవశాత్తూ హైవే డివైడర్‌ను ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతినడంతో, హైవే మధ్యలో అడ్డుగా ఆగిపోయింది. కారులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమీపంలోని కాటూరి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కారును పక్కకు తరలించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

గుంటూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ సీహెచ్. రమేష్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృత తనిఖీలను నిర్వహించారు. చౌడవరం, దాసరిపాలెం, చల్లావారిపాలెం, అంకిరెడ్డిపాలెం, పొత్తూరు, లాలుపురం గ్రామాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీ.హెచ్. వెంకటేశ్వరరావు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. శ్రీనివాసబాబుతో పాటు 51 మంది అధికారులు, 162 మంది సిబ్బంది కలిసి 51 బృందాలుగా ఏర్పడ్డారు. 3,768 సర్వీసులను తనిఖీ చేశారు. మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ 1.50 లక్షలు, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 333 మందికి రూ 14.75 లక్షలు కలిపి మొత్తం రూ 16.25 లక్షల అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డీఈఈలు కె. రవికుమార్ పాల్గొన్నారు.

వెద సాగులో మెలకువలు పాటించాలి

ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్. వెంకటలక్ష్మి, డాక్టర్ ఎం.వెంకటరాములు



జాగ్రత్తలు వివరిస్తున్న అధికారులు

కొల్లిపర: వెద పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతులు కలుపు నివారణ, ఎరువుల వినియోగం పై తగు జాగ్రత్తలు పాటించినప్పుడే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మీ, డాక్టర్ ఎం.వెంకటరాములు అన్నారు. మండల పరిధిలోని జెముడుబాడు, చక్రాయపాలెం గ్రామాల్లో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమఖ్య అతిథులుగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొని మండలంలో ఎక్కువ శాతం రైతులు వెద పద్ధతి ద్వారా వరి విత్తనాలు వేయటం వలన తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై మాట్లాడుతూ వెద పద్ధతిలో వరి గింజలు విత్తిన 2-3 రోజులలోపు ఎకరానికి లీటరు పెండిమిదాలిన్ లేదా 500మిలీ ప్రిటిలాక్లోర్, సేఫనర్ లేదా 35గ్రాముల ఆక్సాడయార్జిల్ వంటి వాటిలో ఏదో ఒక మందును 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలని సూచించారు. 15-20 రోజులకు కలుపు ఉధృతిని బట్టి బిస్‌పైనిబాక్ సోడియం మందును 120 మిల్లీ గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. అలాగే 20-25 రోజులప్పుడు వెడల్పు లాంటి ఆకుజాతి కలుపు మొక్కలు ఎక్కువగా వుంటే సోడియం సాల్ట్ 2గ్రాములు, లేదా 2,4 డి అమైన్ సాల్ట్ 2 మిలీ లీటరు నీటికి కలపి పిచికారీ చేయాలని సూచించారు.

ఎరువుల యాజమాన్యంలో భాగంగా ఎరువును మోతాదు ప్రకారం వెద పెట్టక ముందే ఆఖరి దుక్కిలో భాస్వరం, పొటాష్ సగభాగం, వేసుకోవాలి, ఆంకురం ఏర్పడే దశలో పొటా ష్ సగబాగం, నత్రజని ఎరువుతో వేసుకోవాలి. నత్రజని ఎరువును మూడు దఫాలుగా విత్తిన 15 రోజులకు, పిలక దశలో, అంకురం దశలో వేయాలని సూచించారు. ఆరుతడి వరిలో ఇనుపధాతు లోపం ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే లీటరు నీటికి 20 గ్రాముల అన్న భేదిని 2గ్రాముల నిమ్మ ఉప్పుతో కలపి పిచికారీ చేయాలన్నారు. వీటితో పాటు రైతులు సమగ్రసంరక్షణ చేపట్టినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరెడ్డి, వ్యవయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



సూచనలు చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషన్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్‌చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు.33వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. రైల్వే ట్రాక్ సమీపంలోని కాల్వలను బాగు చేయించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ కొంత అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. వాటిని బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆమె వెంట 33వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మొగల్ అహ్మద్‌బేగ్, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

■ సాగునీటి శాంపిల్స్‌ను జాగ్రత్తగా సేకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. బుధవారం 10,11 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న తాగునీటి శాంపిల్స్ ప్రక్రియను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం కింద ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌లకు పంపుతున్నట్లు చెప్పారు. అలాగే ఒకటోవ డివిజన్‌లోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఆందోళన చేస్తున్న ఇంజనీరింగ్ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

తెనాలిఅర్బన్: మున్సిపాలిటీలో పనిచేసే ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ డిమాండ్ చేశారు. తెనాలి ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ వద్ద కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా సౌకార్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ప్రధానకార్యదర్శి దిలీప్‌కుమార్, చక్రి, గోపికృష్ణ, ప్రశాంత్, ప్రదీప్, సునీల్, గోపి, సతీష్, కరిముల్లా, ఈశ్వరరావు, కిరణ్‌కుమార్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు



కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పిడపర్రు గ్రామం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని అన్నవరం గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పామర్తి శ్రీరామకృష్ణ మరో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధుతో కలసి బైకు పై వల్లభాపురం గ్రామ సచివాలయంకు వెళ్తుండగా పిడపర్రు శివారులో రోడ్డుకు అడ్డంగా భారీ పాము ఎదురుపడింది. దీంతో సడన్ బ్రేక్ వేయటంతో బైకు అదుపుతప్పి ఇద్దరు క్రింద పడ్డారు. ఈ ఘటనలో శ్రీరామకృష్ణకు తీవ్రగాయాలవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేసి అనంతరం తెనాలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్లు, కాల్వల నిర్మాణానికి శ్రీకారం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



శంకుస్థాపన చేస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతి రావు

తెనాలిఅర్బన్: పట్టణంలో రోడ్లు, కాల్వలు నిర్మాణానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 11వ వార్డు గురవయ్య కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు, కాల్వలకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు మాట్లాడుతూ రూ.7.20 లక్షలతో వీటి నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గ్యాస్ డెలివరీ బాయ్ మృతి

తెనాలిరూరల్: అనుమానాద్పద స్థితిలో గ్యాస్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహాల వద్ద చోటు చేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్ సుందరయ్యనగర్‌కు చెందిన దాసరి బాలస్వామి (20) గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్నేహితులతో కలసి జగ్గడిగుంట పాలెంలోని టిడ్కో గృహాలకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం చూడగా కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు స్నేహితులపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు పడి ఉంటాడని.. తమకు తెలియదని స్నేహితులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతి కింద రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

తెనాలిరూరల్: వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద పరిగణించేదే మధ్యవర్తిత్వం అని తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 90 రోజుల కార్యక్రమాల్లో భాగంగా బుధవారం తెనాలి కోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వం-దేశం కోసం అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణ నుంచి కొత్తపేట మీదుగా గాంధీ చౌక్ వరకు 1కే రన్ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ కోర్టులో విచారణ వరకు వెళ్లకుండా తమ వివాదాలను పరిష్కరించుకునేందుకు ఉపయోగపక్షాలకు ఈ వివాదంతో సంబంధం లేని, మూడవ పక్షం సహాయం చేసే ప్రక్రియే మధ్యవర్తిత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం. ఇందిరాప్రియదర్శిని, పవన్ కుమార్, వివేక్ వర్ధన్, రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, న్యాయవాదులు పిల్లి రమేష్, భవాని, పారా లీగల్ వాలింటర్స్, మండల లీగల్ సర్వీసెస్ కమిటి సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నిజాంపట్నం: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు నిజాంపట్నం ఎస్ఐ కందుల తిరుపతి రావు తెలిపారు. అడవులదీవి పోలీసు స్టేషన్ పరిధిలోని నక్షత్రనగర్ బీచ్ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో బుధవారం సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.9,250 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడి చేసిన వారిలో అడవులదీవి ఎస్ఐ బి.బాబూరావు తదితరులున్నారు.

కుటుంబాల సర్వేకు గ్రామ సభలు

చుండూరు(వేమూరు): గ్రామీణ ప్రాంతాల్లో బంగారు కుటుంబాలను సర్వే చేసేందుకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సుదీప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు ఈ నెల 15వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించడం జరుగుతుందని ఆమె చెప్పారు. బుధవారం అంబేద్కర్‌నగర్, మున్నంగివారిపాలెం, తొట్టింపూడిలో గ్రామ సభలు నిర్వహించారు. 17న చినపరిమి, పెదగాదెలవర్రు, 18న దుండిపాలెం, యడ్లపల్లి, 19న మోదుకూరు 1, 2, సచివాలయాలు, 21న చుండూరు, పెనుగుదురుపాడు, 22న వలివేరు, వేటపాలెం గ్రామాల్లో సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) తెనాలి కోర్టులో
OS NO. 77/2017
గరిక గాయత్రి ...వాది
పన్నాల వెంకటేశ్వరరావు వగైరాలు ...ప్రతివాదులు
14)పుల్లె మహాలక్ష్మి W/o P.రామచంద్రరావు
15)మల్లాది లక్ష్మీవరసమ్మ W/o M.రామమూర్తి
ఇరువురి నివాసం,2-2-70/209 ప్రజాయ్ ఎవెన్యూ ఫేజ్-1,తురబ్‌నగర్, అంబరుపేట, హైదరాబాద్
16)పిల్లట్ల గిరిజ కుమారి W/o P. అమరనాథ్ డి.నెం. 21-4-1, నేతివారి స్ట్రీట్, తెనాలి టౌన్ గుంటూరుజిల్లా. ...ప్రతివాదులు
పై నెంబరు దావా మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినాను తీసుకొని కారణంగా శ్రీకోర్టు వారు ఈ పేపరు పబ్లికేషన్ ఆర్డరు జారి చేసి ది 04-08-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆ వాయిదా రోజున ఉదయం 10-30ని॥ లకు పై కోర్టు వారి ఎదుట మీరుగాని మీ తరఫున న్యాయవాది ద్వారా శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు.
(శ్రీ కోరు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 04-08- 2025
కూర్మాల దుర్గాప్రసాద్.
వాది తరపు న్యాయవాది.సెల్: 9848148573

రాష్ట్రస్థాయి పోటీలకు అంగలకుదురు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తెనాలిరూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు తెనాలి మండలం అంగలకుదురు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్ పోటీల్లో అంగలకుదురు హైస్కూలు విద్యార్థులు సీహెచ్ కరుణ, సీ.హెచ్. ఆంజనేయులు 100 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, వి. విజయసాయి భవాని శేఖర్ 60 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాపట్ల జిల్లాలో త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను వ్యాయామోపాధ్యాయులు వేమూరి శరత్‌బాబు, పులివర్తి రాజులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనురాధ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు బుధవారం అభినందించారు.

శివయ్య సన్నిధిలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పూజల్లో ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్, అర్చకులు, వేద పండితులు

పెదకాకాని: స్థానిక శివాలయంలో బుధవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. శైవాగమం అనుసరించి శుక్రవారం వరకు నిర్వహించనున్న ఉత్సవాలలో తొలిరోజు ఉదయం పవిత్రాలు గల వెదురుపేటికలతో యాగశాల ప్రవేశం, శివానుజ్ఞ శ్రీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య పూజ, ప్రాశన, రక్షాసూత్ర పూజ, ధారణ, ఋత్విగ్వరణ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, యాగేశ్వర కుంభస్థాపన, పూజ, వాస్తు కుంభస్థాపన, పూజ, వాస్తు శాంతి హోమం, బలి పర్యాగ్నికరణ, బలిహరణ తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి మంగళ వాయిద్యం, చతుర్వేద పారాయణలు, గోపూజ అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, వాస్తుశాంతి, వాస్తుపర్యగ్నికరణ, మృత్స్గ్రహణం, అంకురార్పణం, రక్షా బంధనం, మంత్రపుష్పం, హారతి విభూతి, కుంకుమ ప్రసాద వితరణ జరిగినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. రెండో రోజు గురువారం పలు పూజల్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమాల్లో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చక పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, అర్చకులు, దాతలు తెనాలికి చెందిన నేలవెల్లి కోటేశ్వరి, కర్నే శివ సందీప్ నాగ శిరీష దంపతులు, రెడ్డి నవీన్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు, నేలివెల్లి నాగప్రత్యూష పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులతో ఎన్నో ఉపయోగాలు

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి, ఆరెమండ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకొని పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట బీమాలో పేరు నమోదుతో నష్టం వాటిల్లినప్పుడు సీసీఆర్సీ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల బీమా గడువు ఆగస్టు 15 వరకు ఉందని, ఎకరా వరి పైరుకు రూ. 800 ప్రీమియం చెల్లించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పి. మాణిక్యరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

సీసీఆర్సీ కార్డులతో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏవో సునీత అన్నారు. వట్టిచెరుకూరు మండలం చింతపల్లిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీఆర్సీ కార్డులు, భూసార పరీక్షలు, పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం, సస్యరక్షణ పద్ధతులు, రాయితీలపై ఏవో సునీత రైతులకు వివరించారు. అర్హత ఉండీ ఆసక్తి కలిగిన కౌలు రైతులు సీసీఆర్సీ కార్డుల కోసం రైతు సేవ కేంద్రం లేదా వీఆర్వోలను సంప్రదించాలని ఆమె సూచించారు. టీబీక్ 104, వీబీన్ 8 రకం మినుముల మినీ కిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులకు నూరు శాతం రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్ఏ మోనాలిసా, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో భూమి సారవంతం



ఘన వ్యర్థాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏవో వాసంతి

ఫిరంగిపురం: పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసరలను భూమిలో కలియదున్నడం వల్ల సారవంతంగా ఉంటుందని ఏవో వాసంతి చెప్పారు. మండలంలోని వేమవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేల సారవంతం అయితే పంటలు బాగా పండుతాయని చెప్పారు. భూమి బెట్టకు రాదని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. పత్తి సాగులో సమగ్ర సస్యరక్షణ పాటించాలని చెప్పారు. పొగాకులో లద్దె పురుగు నివారణకు ఆముదం మొక్కలు పెంచాలని సూచించారు. ఐటీసీ కంపెనీ ప్రాజెక్ట్ అసోసియేట్ కోటేశ్వరరావు తడిపొడి వ్యర్థాల విభజన, తడి వ్యర్థాలతో వర్మీకంపోస్టు తయారీ గురించి వివరించారు. అనంతరం ఘన వ్యర్థాలు గురించి సమగ్రంగా తెలియజేసే వాల్‌పోస్టర్లను ఏవో వాసంతి ఆవిష్కరించి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి షేక్ సుభాని, వ్యవసాయ సహాయకులు సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



వైద్య సేవలను పరిశీలిస్తున్న రంగారావు

ప్రత్తిపాడు: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వి. రంగారావు హెచ్చరించారు. ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పనితీరు, హాజరుతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలు, కాన్పులు సిజేరియన్‌ల వివరాలను హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. సాధారణ కాన్పులు, శస్త్ర చికిత్సల వివరాలను గైనకాలజిస్ట్ డాక్టర్ డి. విజయలక్ష్మి, పీడియాట్రీషియన్ డాక్టర్ సీహెచ్. నాగార్జున, అనస్థీషియా డాక్టర్ వర్షశ్రీలు డీసీహెచ్ఎస్‌కు వివరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్యాధికారులు ఫేస్ రికగ్నిషన్ ద్వారా మాత్రమే హాజరు వేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించుకున్నా, విధుల్లో అలసత్వం వహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రత్తిపాడు ఆస్పత్రిలో ముగ్గురు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశామని, సీఎల్, ఈఎల్ నిలిపివేశామని వివరించారు. పనితీరులో మార్పు లేనిపక్షంలో సస్పెన్షన్ చేసేందుకు కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు పంపితే చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను టెస్టులు, స్కానింగులు, మెరుగైన వైద్యం అంటూ ప్రైవేటు హాస్పిటల్స్‌కు పంపిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని డీసీహెచ్ఎస్ బి.వి. రంగారావు హెచ్చరించారు.

'తొలి అడుగు'లో సమస్యల వెల్లువ

చేబ్రోలు: స్థానిక ముస్లిం ఏరియాలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లు బుధవారం పర్యటించారు. ప్రభుత్వం చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో చేపట్టిన కార్యక్రమాలపై కరపత్రాలను స్థానికులకు అందజేశారు. పలువురు సమస్యలను మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరితగతిన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మైలా రామరాజు, చందు శ్రీరాములు, ఖాదర్ బాషా, పఠాన్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల అందించారు.







